# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 10-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆగ్నేయాసియా దేశాలు ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా అంత్యక్రియలు కొద్ది సేపటి క్రితం ముంబయిలో ముగిశాయి.
- దుర్గా పూజ పండుగను పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శాభాకాంక్షలు తెలిపారు.
- "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" స్ఫూర్తిని బలోపేతం చేయడంలో చలనచిత్రం ఒక శక్తివంతమైన సాధనమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.
- యువత సాంస్కృతిక రాయబారులుగా మారాలని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఆకాంక్షించారు.

==============================

ఆగ్నేయాసియా దేశాలు ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. లావోస్ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి ఈరోజు 21వ ఆసియాన్ - ఇండియా సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21వ శతాబ్దం భారత్, ఆసియాన్ దేశాల శతాబ్దమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో సంఘర్షణ, ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న సమయంలో భారత్, ఆసియాన్ దేశాల మధ్య స్నేహం, సమన్వయం, సంభాషణలు, సహకారం చాలా ముఖ్యమైనవని ఉద్ఘాటించారు. భారత్, ఆగ్నేయాసియా దేశాల మధ్య చారిత్రాత్మక సంబంధాలకు 'యాక్ట్ ఈస్ట్ పాలసీ నూతన ఉత్తేజాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

కాగా ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి ఆసియాన్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా అంత్యక్రియలు కొద్ది సేపటి క్రితం ముంబయిలో ముగిశాయి. ముంబయిలోని వర్లి శ్మశాన వాటికలో మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించింది. ఈ అంత్యక్రియలకు కేంద్ర ప్రభుత్వం తరఫున హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. ఈ రోజు ఉదయం నుండి దేశంలోని పలువురు ప్రముఖులు రతన్ టాటా పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించారు. కాగా నిన్న రాత్రి 11 గంటల 30 నిమిషాలకు ముంబాయిలోని బీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రతన్ టాటా తుది శ్వాస విడిచారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దుర్గా పూజను పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు, ఈ పండుగ అన్ని మతాల మధ్య ఐక్యతను అవగాహనను పెంపొందించడానికి ఒక సందర్భం అని పేర్కొన్నారు. దుర్గాపూజను చెడుపై మంచి సాధించిన విజయంగా జరుపుకుంటామని, న్యాయమైన, సున్నితమైన, సమానమైన సమాజాన్ని సృష్టించడానికి  దుర్గా మాత మనకు శక్తిని, ధైర్యాన్ని దృఢ నిశ్చయాన్ని ప్రసాదించాలని ప్రార్థిద్దామని ఆమె తన సందేశంలో వివరించారు. మహాశక్తిని ప్రసన్నం చేసుకునే ఈ శుభ సందర్భంగా, మహిళలను అత్యంత గౌరవంగా చూడాలని సంకల్పిద్దామని వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిని బలోపేతం చేయడంలో చలనచిత్రం ఒక శక్తివంతమైన సాధనమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రాధాన్యతను వివరిస్తూ... భారతీయ సినిమాలు విస్తృతమైన భాష, సాంస్కృతిక వైవిధ్యాలతో దేశవ్యాప్తంగా ఐక్యతను పెంపొందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రాజ్ కపూర్ కాలం నాటి "శ్రీ 420" సినిమా నుండి.. మణిరత్నం రోజా వరకు భారతీయ సినిమాలు భాషతో సంబంధం లేకుండా దేశ ప్రజల హృదయాలను హత్తుకున్నాయని తెలిపారు. గరమ్ హవా, దో బిఘా జమిన్ వంటి సినిమాలు ఐక్యతను ప్రోత్సహిస్తూనే సామాజిక సవాళ్లకు అద్దం పట్టాయని పేర్కొన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ స్థాపనతో సహా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించిన కేంద్ర మంత్రి, భారతీయ సినిమాను ప్రపంచ వేదికపై ఉన్నతంగా నిలపడమే లక్ష్యమని ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యువత సాంస్కృతిక రాయబారులుగా మారాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఆకాంక్షించారు. నవీ ముంబైలో ఈరోజు జరిగిన "వికసిత్ భారత్ అంబాసిడర్ యువ కనెక్ట్" కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. భారత్ అనేక మంది ప్రపంచ పర్యాటకులకు ఆకర్షణీయ కేంద్రంగా మారిందన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలకు విలువలకు రక్షకులుగా ఉండాలని విద్యార్థి సమాజాన్ని కోరారు. దేశ నిర్మాణానికి సహకరించడానికి, వికసిత్ భారత్‌ను సాధించి, స్వాతంత్ర్య సమర యోధులకు నిజమైన నివాళులు అర్పించడానికి ఇది సరైన సమయం, అవకాశమని ఆయన పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పరిశ్రమల స్థాయిని మరింత విస్తరించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన పిహెచ్‌డి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 119వ వార్షిక సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...

పరిశ్రమలు పెద్ద లక్ష్యాలను పెట్టుకుని, వాటిని సాకారం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం 2 వేలకు పైగా కాలం చెల్లిన వలస చట్టాలను తొలగించిందని, క్రిమినల్ పెనాల్టీల నుండి కంపెనీల చట్టాన్ని సంస్కరించిందని, 39 వేలకు పైగా అనుమతులను సడలించిందని ఆయన వివరించారు. రానున్న 25 సంవత్సరాల్లో భారత్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా మార్చేందుకు కృషి చేయాలని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

అలాగే ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త రతన్ టాటాకు నివాళులు అర్పిస్తూ... టాటా గ్రూప్‌ను భారతీయ పరిశ్రమకు దిక్సూచిగా మార్చడంలో రతన్ టాటా కీలక పాత్ర పోషించారని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూకశ్మీర్ లోని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ (NC) శాసన సభాపక్ష నేతగా ఆ పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 90 అసెంబ్లీ స్థానాలున్న జమ్మూ-కశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో NC 42 సీట్లను గెలుచుకోగా.. కాంగ్రెస్ 6 స్థానాల్లో గెలుపొందింది. తాజాగా NCకి ఎన్నికల్లో గెలిచిన నలుగురు స్వతంత్ర్య అభ్యర్థులు మద్దతు ప్రకటించారు. మరోవైపు.. 29 స్థానాలు గెలుచుకున్న బీజేపీకి ముగ్గురు స్వతంత్ర్య అభ్యర్థుల మద్దతు లభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రాలు అభివృద్ధి, మూలధన వ్యయాలను పెంచేందుకు వీలుగా 1,78,173 కోట్ల రూపాయలను పన్నుల పంపిణీ రూపంలో కేంద్ర ఆర్థిక శాఖ ఈరోజు విడుదల చేసింది. ఇది సాధారణ నెలవారీ 89,086.50 కోట్ల రూపాయలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తున్న మొత్తమని పేర్కొంది. రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాలు మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడంతో పాటు అభివృద్ధి, సంక్షేమం సంబంధిత వ్యయాలకు ఆర్థిక సహాయం చేయడానికి ఇది ఉద్దేశించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ కు 7,211 కోట్ల రూపాయలు, తెలంగాణకు 3,745 కోట్ల రూపాయలు అందనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద హిజ్బ్-ఉత్-తహ్రీర్ సహా దాని అనుబంధ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తూ... హిజ్బ్-ఉత్-తహ్రీర్ సంస్థ యువతను ISIS వంటి ఉగ్రవాద సంస్థలలో చేరడానికి ప్రోత్సహిస్తోందని, ఇంకా ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమీకరిస్తోందని పేర్కొంది. వివిధ సామాజిక మాధ్యమాల వేదికగా ఉగ్రవాద చర్యలకు పాల్పడేలా యువతను హిజ్బ్-ఉత్-తహ్రీర్ ప్రోత్సహిస్తోందని మంత్రిత్వ శాఖ వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

2024 సంవత్సరానికి గాను సాహిత్యంలో నోబెల్ బహుమతి దక్షిణ కొరియా రచయిత హాన్ కాంగ్‌కు లభించింది. చారిత్రాత్మక గాయాలను ఎదుర్కొనే, మానవ జీవితంలోని దుర్బలత్వాన్ని బహిర్గతం చేసే కవితా గద్యానికి ఆమెకి ఈ పురస్కారం లభించిందని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లోని నోబెల్ కమిటీ ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

టెన్నిస్ ఆటగాడు రఫెల్ నాదల్ ఆటకు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించారు. నవంబర్‌లో జరగనున్న డేవిస్ కప్ ఫైనల్ తన చివరి టోర్నీ అని నాదల్ ఈరోజు వెల్లడించారు.

================================

పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సు చేసిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడాన్ని వ్యతిరేకిస్తూ.. కేరళ అసెంబ్లీ ఈరోజు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కేరళ రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఎం.బి. రాజేష్ మాట్లాడుతూ... ఇది ప్రజాస్వామ్య విరుద్ధమని, రాజ్యాంగ విరుద్ధమని భారతదేశ సమాఖ్య నిర్మాణాన్ని బలహీనపరుస్తుందన్నారు. ఈ కమిటీ నివేదికలో ఖర్చులను తగ్గించాలని పేర్కొన్నారని, అయితే అందుకు ఇతర మార్గాలు ఉన్నాయని, ఇది అధికారాన్ని కేంద్రీకరించే ప్రయత్నం మాత్రమే అని పేర్కొన్నారు.

================================
================================